సాక్షి
రంగారెడ్డి
మంగళవారం : 15 : ఏప్రిల్ : 2025



వడగళ్ల వాన

యాచారం మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. 8లో▸



అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



'భూ భారతి'తో..

రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం భూ భారతి అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రతిపాదనలు పంపితే.. అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట మరమ్మతులు చేయించాలన్నారు. భవిష్యత్తులో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



కొందుర్గులో పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్

కొందుర్గు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని శంషాబాద్ డీసీపీ రాజేష్ హెచ్చరించారు. కొందుర్గు పోలీసుస్టేషన్ సోమవారం సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. పీఎస్ రికార్డులు, కేసు ఫైళ్లు, పోలీసు క్వార్టర్స్, పీఎస్‌లో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెట్రోలింగ్ సిబ్బంది 100 డయల్‌కు కాల్ వచ్చిన వెంటనే జాప్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకొని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఎస్సైలు రవీందర్ నాయక్, బాలస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కెమిస్ట్రీ బోధించేందుకు రెండు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మహిళా అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

విమానంలో వృద్ధుడికి అత్యవసర పరిస్థితి..

ఆదుకున్న సిటీ డాక్టర్



డాక్టర్ ప్రీతి రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: విమాన ప్రయాణంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వృద్ధుడిని నగరానికి చెందిన వైద్యురాలు అత్యవసర వైద్య సేవలతో కోలుకునేలా చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకోగా.. సోమవారం వెలుగు చూసింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న 74 ఏళ్ల ఒంటరి వృద్ధుడికి అకస్మాత్తుగా మగతలోకి జారుకుని, నోటి నుంచి నురగ వచ్చింది. అదే విమానంలో ప్రయాణిస్తున్న నగరంలోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠం జనరల్ ఫిజీషియన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతి రెడ్డి వెంటనే స్పందించారు. ఆయన పల్స్ బలహీనంగా ఉందని, బీపీ తక్కువగా ఉందని గుర్తించారు. అత్యవసరంగా సీపీఆర్ చేయడంతో సదరు ప్రయాణికుడు కొన్ని నిమిషాల్లో స్పృహలోకి వచ్చారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ సిబ్బంది సహకారంతో ఆ వృద్ధుడిని క్షేమంగా గమ్యానికి చేర్చారు. సకాలంలో స్పందించి వృత్తి పరమైన నిబద్ధతను ప్రదర్శించిన డా.ప్రీతిరెడ్డిని ప్రయాణికులు అభినందించారు.

ఇదేం ప'రేషన్'!

జిల్లాలో 23 వేలకుపైగా కొత్త కార్డులు జారీ



- కార్డుల్లో కనిపించని లబ్ధిదారుల పేర్లు
- సన్నబియ్యానికి నోచుకోని వైనం
- రేషన్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు
- తలలు పట్టుకుంటున్న డీలర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆహార భద్రత కార్డుపై ఒకరికి ఆరు కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డుపై ఒకరికి పది కేజీల చొప్పున, అంత్యోదయ కార్డుపై ఒకరికి 35 కిలోల చొప్పున ప్రభుత్వం బియ్యం ఉచితంగా సరఫరా చేస్తోంది. అంత్యోదయ కార్డుపై చక్కెర కిలో రూ.13.50కి ఇస్తోంది. ఇక గోధుమలు జీహెచ్‌ఎంసీ ఏరియాలో రూ.7 చొప్పున ఐదు కేజీలు, కార్పొరేషన్ పరిధిలో రెండు కేజీలు, మున్సిపాలిటీ సహా గ్రామీణ ప్రాంతాల్లో కేజీ చొప్పున సరఫరా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 5,58,664 రేషన్‌కార్డులు ఉండగా, వీటి పరిధిలో 18,25,128 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 11,631.810 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అంచనా వేసింది. ప్రజాపాలన, కులగణనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరు చేసింది. కొత్తగా 23 వేల మందికి కార్డులు జారీ చేసింది. నెలవారీ కోటా విడుదల చేయకపోవడం, ఈకేవైసీ కాకపోవడంతో లబ్ధిదారులకు నిత్యావసరాలు అందడం లేదు. ప్రస్తుతం చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తుండటంతో కార్డులు పొందిన ఆయా లబ్ధిదారులకు నిరాశ తప్పడం లేదు. ఈ విషయంపై డీలర్లకు కూడా క్లారిటీ లేకపోవడంతో వచ్చిన వారికి ఏం చెప్పాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

లబ్ధిదారులందరికీ సరఫరా చేస్తున్నాం

అర్హులైన లబ్ధిదారులందరికీ సన్న బియ్యం సరఫరా చేశాం. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అక్కడి లబ్ధిదారులు చాలామంది జిల్లా పరిధిలోని రేషన్ షాపుల్లో బియ్యం తీసుకున్నారు. పోర్టబులిటీ ఎక్కువగా నమోదైంది. జిల్లా కోటాకు మించి దుకాణాలకు సరఫరా చేశాం. డీలర్లు రెండు పూటలా బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొత్త కార్డుదారులకు బియ్యం సరఫరా చేయలేదనే ఆరోపణల్లో వాస్తవం లేదు. కార్డులు జారీ చేసిన వారందరికీ కోటా మంజూరు చేశాం.

– పి.శ్రీనివాస్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి



చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు చంటి శాంతి. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ. భర్త ఇటీవలే మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు. ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంది. ఇటీవల ప్రభుత్వం రేషన్ కార్డు (నంబర్ 365371648123) మంజూరు చేసింది. అయితే కార్డులో ఆమె పేరు కన్పించలేదు. కేవలం ఇద్దరు పిల్లల పేరుతోనే కార్డు జారీ చేశారు. ఈపాస్ మిషన్ పిల్లల వేలిముద్ర తీసుకోవడం లేదు. దీంతో ఆ కుటుంబం సన్న బియ్యానికి నోచుకోలేకపోయింది.



చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు సిలువేరు లావణ్య. ఇటీవలే భర్త మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కవలపిల్లలు. ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వం ఇటీవల మూడేళ్ల కుమారుడు సాయికృష్ణ పేరుతో కార్డు (నంబర్ 365371632786) మంజూరు చేసింది. కార్డులో తల్లితో సహా మరో పిల్లాడి పేరు కన్పించలేదు. దీంతో ఇప్పటి వరకు ఆ కార్డుకు నిత్యావసరాల కోటా కేటాయించ లేదు. వీరే కాదు కొత్తగా రేషన్‌కార్డులు పొంది ప్రభుత్వం సరఫరా చేసే సన్న బియ్యం కోసం రేషన్ షాపుల వద్దకు వెళ్తున్న అనేక మందికి ఇలాంటి చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి.

జిల్లాలో ఇదీ లెక్క..

రేషన్ కార్డులు	అర్బన్	రూరల్
అంత్యోదయ	4,899	29,839
ఆహార భద్రత	2,03,505	3,20,381
అన్నపూర్ణ	01	39
రేషన్‌షాపులు	218	701
మొత్తం కార్డులు	2,08,405	3,50,259
మొత్తం యూనిట్లు	6,84,902	11,40,120
కేటాయించిన బియ్యం	4,221.145 (మె.ట)	7,410.665 (మె.ట)



అంబేడ్కర్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని అందరూ ముందుకుసాగాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని కొత్తూర్ గేట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా కేసీఆర్ హయాంలో సెక్రటేరియట్‌కు ఆయన పేరు పెట్టారని అన్నారు. ఎవరి వద్దా చేయి చాపొద్దనే ఉద్దేశంతో దళితులకు దళిత బంధు పథకం తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కాకి దశరథ, జి.సామయ్య, జంగయ్య, రాంరెడ్డి, ఆనంద్, జైపాల్, ఇందిర, కృష్ణ, సురేష్, వెంకటేష్, నర్సింహ, నవీన్, మేఘనాథ్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, దీక్షిత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీహరి, లచ్చానాయక్, శ్రీనివాస్, యాదయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య

షాద్‌నగర్: విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య అన్నారు. పట్టణంలోని ఎంఆర్సీ భవనంలో సోమవారం సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు అధ్యక్షతన 'పాఠశాల విద్య–ప్రభుత్వ విధానం, మనకర్తవ్యం'అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ–2020) పేద వర్గాలకు నాణ్యమైన విద్యను దూరం చేసేవిధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను కేంద్రీకరించేలా, కార్పొరేటీకరణకు అనుకూలంగా ఉందన్నారు. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రతి మండలంలో 4 నుంచి 5 పాఠశాలలను ఎంపిక చేసుకొని ప్రీ ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలలు ఒకే దగ్గర ఉండేలా, 6 నుంచి 12వ తరగతి వరకు ఒక క్యాంపస్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సత్యం, రామకృష్ణ, వినీత్, శేఖర్‌గౌడ్, బాలయ్య, జేవీవీ నాయకులు వెంకటరమణ, కుర్మయ్య, సీఐటీయూ నాయకుడు రాజు, టీజీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ, డీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య



కుర్మిద్దలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

రాజ్యాంగాన్ని విస్మరించొద్దు

- రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, విస్మరించడం తగదని రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. యాచారం మండలంలోని కుర్మిద్దలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో జైభీమ్ కార్యక్రమం నిర్వహించారు. నాలుగు గ్రామాల రైతులు, కూలీలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రజల అంగీకారం లేనిదే భూసేకరణ చేయకూడదని, బలవంతపు సేకరణ చట్ట వ్యతిరేకమని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ఫార్మా సిటీ రద్దు చేసి రైతుల భూములు రైతులకే ఇవ్వాలని కోరారు. కోర్టు స్టే ఆర్డర్‌ను గౌరవించాలని, రైతులను భయభ్రాంతులకు గురి చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ పోరాట కమిటీ కన్వీనర్లు కవుల సరస్వతి, కుందారపు నారాయణ, మాజీ సర్పంచ్ బందే రాజశేఖర్‌రెడ్డి, కనమోని గణేశ్, మహిపాల్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్, వినోద్‌రెడ్డి, లింగం, సామ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చక్రస్నానం.. తరించిన భక్త జనం

- ముగిసిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు
- చివరిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు

మొయినాబాద్: ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు సోమవారం చక్రస్నానంతో ముగిశాయి. చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలోని హోమగుండాల గదిలో పూర్ణాహుతి చేపట్టారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్టదిక్పాలకులకు నైవేద్యంగా సమర్పించి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అద్దాలపల్లకీలో ఆసీనులను చేసి అలంకరించారు. అనంతరం చక్రస్వామి, నవపాలికలు, స్వామివారిని పల్లకిలో దేవాలయం చుట్టూ ఊరేగించారు. శివాలయం పక్కనే ఉన్న మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజతో దేవుళ్లందరినీ ఆవాహనం చేసి సుగంధద్రవ్యాలతో నవకలశ అభిషేకం నిర్వహించారు. చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట చెరువులోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ చక్రతీర్థాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహన్, కిట్టు, కన్నయ్య, మురళి పాల్గొన్నారు.



గండిపేట చెరువులోకి చక్రస్వామిని తీసుకెళ్తున్న అర్చకులు

దర్శించుకున్న పట్నం మహేందర్‌రెడ్డి

మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకుడు రంగరాజన్ ఆయనకు పూలమాల వేసి స్వామివారి ఆశీర్వాదం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండు గోపాల్, నాయకులు భిక్షపతి, బాల్‌రాజ్, శంకర్ తదితరులు ఉన్నారు.

తరలివచ్చిన భక్తజనం

బ్రహ్మోత్సవాల చివరిరోజు పరిసర ప్రాంతాలతో పాటు నగరం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. చక్రతీర్థం సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి అధికంగా విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధ్వజావరోహణంతో ముగింపు

బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా వస్త్రంపై గరుడ పటాన్ని చిత్రించి ధ్వజస్తంభానికి ఆరోహణం చేసిన వస్త్రాన్ని ముగింపు సూచికగా అవరోహణం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు.

రాంగ్.. రైడ్!

- మూడు కమిషనరేట్ల పరిధిలో రాంగ్ సైడ్ డ్రైవింగ్
- ఈ ఏడాది మార్చి వరకు 4,32,824 కేసులు నమోదు
- సైబరాబాద్‌లో ఫలితాలిచ్చిన కొన్ని ప్రయోగాలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిరోజూ 4,809.. వారానికి 33,664.. నెలకు 1,44,270.. మూడు నెలల్లో 4,32,824.. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో నమోదైన రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసుల సంఖ్య ఇది. అత్యంత ప్రమాదకర ఉల్లంఘనల్లో ఒకటైన రాంగ్ సైడ్ డ్రైవింగ్ ఏటా అనేక మంది ప్రాణాలు తీస్తోంది. మరెందరినో క్షతగాత్రులుగా మారుస్తోంది. అయినప్పటికీ వాహన చోదకుల్లో మాత్రం మార్పు రావట్లేదు. ఈ సమస్య తీవ్రంగా ఉన్న సైబరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న కీలక చర్యలు ఫలితాలిచ్చాయి. దీంతో నగరంలోనూ అలాంటి పంథా అనుసరించడానికి ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ అధ్యయనం చేస్తున్నారు.

ఉల్లంఘనల్లో మూడు రకాలు..

రహదారి భద్రతకు సంబంధించిన నిబంధనల్ని అమలు చేస్తూ, మోటారు వాహనాల చట్టాన్ని అమలు చేసే ట్రాఫిక్ విభాగం అధికారులు ఉల్లంఘనులకు చెక్ చెబుతుంటారు. క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు వాహన చోదకులు పాల్పడే 39 రకాలైన ఉల్లంఘనలపై దృష్టి పెట్టి ఈ– చలాన్లు జారీ చేస్తుంటారు. ఈ ఉల్లంఘనల్ని అధికారులు మూడు రకాలుగా విభజిస్తుంటారు. వాహనం నడిపే వ్యక్తికి ప్రమాదహేతువైనవి మొదటి కేటగిరీలో, ఎదుటి వ్యక్తిని ప్రమాద హేతువైనవి రెండో కేటగిరీలో ఉంటాయి. వాహనం నడిపే వ్యక్తితో పాటు ఎదుటి వారికీ ముప్పు తెచ్చే వాటిని అత్యంత ప్రమాకరమైనవిగా మూడో కేటగిరీలో చేరుస్తారు. ఈ కేటగిరీలోకే వచ్చే రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను కట్టడి చేయడానికి కీలక ప్రాధాన్యమిస్తుంటారు.

ఈ కారణాలతోనే అత్యధిక ఉల్లంఘనలు

రాంగ్ సైడ్ డ్రైవింగ్ ఉల్లంఘనలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. చౌరస్తాలు కేంద్రంగా జరుగుతున్న భారీ ట్రాఫిక్ జామ్స్‌కు చెక్ చెప్పడానికి ట్రాఫిక్ విభాగం అధికారులు రాజధానిలోని అనేక ప్రాంతాల్లో జంక్షన్లను మూసేశారు. వీటికి కాస్త దూరంలో 'యూటర్న్' ఇచ్చారు. అక్కడి వరకు వెళ్లి వాహనాలను తిప్పుకొని రావడానికి నిర్లక్ష్యం వహిస్తున్న వాహన చోదకులు కొద్దిదూరం రాంగ్ రూట్‌లో వెళ్లడానికే ఆసక్తి చూపిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఎక్కువగా ఉన్న చోట్ల, ప్రధాన రోడ్లకు అటు–ఇటు కాలనీలు ఉండి, వాటి మధ్య ఎక్కడపడితే అక్కడ డివైడర్లలో గ్యాప్ లేని చోట్ల ఈ ఉల్లంఘనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

కీలక చర్యలు తీసుకున్న జోయల్

హైదరాబాద్ ట్రాఫిక్ విభాగానికి సంయుక్త పోలీసు కమిషనర్‌గా పని చేస్తున్న జోయల్ డెవిస్ కొన్ని రోజుల క్రితం వరకు సైబరాబాద్ ట్రాఫిక్ వింగ్‌కు నేతృత్వం వహించారు. అక్కడ రాంగ్ సైడ్ డ్రైవింగ్ నిరోధించడానికి కీలక చర్యలు తీసుకున్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా అధ్యయనం చేయించి 270 పాయింట్లలో ఈ ఉల్లంఘనలు ఎక్కువగా జరుగుతున్నట్లు తేల్చారు. ఆ పాయింట్ల వద్ద ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేయించి ఉల్లంఘనకు పాల్పడే వారికి ఈ–చలాన్ జారీ చేయించారు. ఈ ఉల్లంఘనకు పాల్పడే వారిలో అత్యధికులు రిపీటెడ్ అఫెండర్లు ఉంటారు. దీంతో ఆ పాయింట్లలో మరుసటి రోజు సిబ్బందిని మోహరించి, ఈ–చలాన్ జరిమానా వసూలు చేయించారు. ఈ విధానం చాలా వరకు రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను నిరోధించింది.

తొలి మూడు నెలల్లో..

కమిషనరేట్	కేసులు
సైబరాబాద్	2,17,000
హైదరాబాద్	1,62,000
రాచకొండ	53,824

వరంగల్ సభను జయప్రదం చేయాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వరంగల్‌లో ఈనెల 27న జరగబోయే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులను భారీగా తరలించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడి కిషన్‌రెడ్డి సూచించారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన మండల, మున్సిపాలిటీల అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బహిరంగసభను విజయవంతం చేయడానికి భారీ జన సమీకరణ చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోర్టుల ద్వారా సభ పెట్టకుండా అడ్డుకోవాలని చూసినా న్యాయం గెలిచిందన్నారు. విజన్ ఉన్న నేత కేసీఆర్ నాయకత్వంలో అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. మరోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కంకణబద్ధులై పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కృపేష్, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, నాయకులు రమేష్‌గౌడ్, కిషన్‌గౌడ్, అల్వాల్ వెంకట్‌రెడ్డి, జెర్కొని రాజు, శివసాయి, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


ఓ గ్రామంలో పడిన వడగళ్లు


యాచారంలో కురిసిన వడగళ్లు

ఈదురు గాలులు.. వడగళ్ల వాన

ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఫార్మా గ్రామాలతో పాటు యాచారంలో ఈదురు గాలులతో కూడిన వర్షం, దానికి తోడు వడగండ్లు పడటంతో పంటచేలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ మామిడి కాయలు రాలిపోయాయి.

హతుడు ఎవరు?

అంతమొందించింది ఎవరు?
- వీడని హత్య మిస్టరీ..
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు


మృతుడి చేతిపై జై బాలయ్య పచ్చబొట్టు


యువకుడి మృతదేహం

షాద్‌నగర్: రెండు రోజుల క్రితం ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఎవరో దుండగులు.. వ్యక్తిని కడుపులో పొడిచి, గొంతు కోసి అంతమొందించారు. అయితే హంతకులు ఎవరు, హతుడు ఎవరు అనేది తెలియరాలేదు. పోలీసుల దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులోని ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో శనివారం అర్ధ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి(30)ని కొందరు దుండగులు కత్తులతో పొడిచి హత మార్చారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పోలీసులు జాగిలాలతో తనిఖీలు నిర్వహించగా.. సమీపంలో ఉన్న జాతీయ రహదారి వద్దకు వచ్చి అవి ఆగిపోయాయి. క్లూస్‌టీం అధికారులు శాంపిళ్లను సేకరించారు. ఇదిలా ఉండగా.. మృతుడి కుడి చేతిపై జై బాలయ్య అని తెలుగులో పచ్చబొట్టు, మెడలో వేంకటేశ్వర స్వామి, అమ్మవారి బొమ్మతో కూడిన లాకెట్ ఉంది. లభించిన ఆధారాలతో మృతుడు ఆంధ్రకు చెందిన వ్యక్తిగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

విస్తృత గాలింపు..
హత్య ఘటన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. హంతకులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసులు నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పరిశీలన, హత్య ప్రదేశంలో మొబైల్ సిగ్నల్ క్యాచింగ్, సాంకేతిక ఆధారాలను సేకరించేందుకు పోలీస్ టీంలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులకు ఏసీపీ రంగస్వామి సూచించినట్లు తెలిసింది.

పిడుగుపాటుతో ఆవుదూడ మృతి


దూడ కళేబరం వద్ద బాధిత రైతు తదితరులు

మాడ్గుల: పిడుగుపాటుతో ఆవుదూడ మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లవారిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బలగొనిచంద్రయ్య సోమవారం సాయంత్రం తన ఆవు దూడకు మేత వేసి, పొలం పనులు చేసుకుంటున్నాడు. ఈ సమయంలో వర్షం మొదలై, ఆవుదూడ సమీపంలో పిడుగు పడింది. దీంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేయాలని బాధిత రైతు కోరాడు.

చలివేంద్రం ప్రారంభోత్సవం

పూడూరు: ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కెరవెళ్లి గేటువద్ద కాంగ్రెస్ నాయకుడు అలీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, కార్యదర్శి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సునీల్, సంధ్యారాణి దంపతులు వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉంటున్నారు. సంధ్యారాణికి ఇటీవల ఖమ్మంకు బదిలీ కావడంతో ఆమె ఈ నెల 4న పిల్లలను తీసుకుని అక్కడికి వెళ్లింది. సునీల్ ఆన్‌లైన్ వ్యాపారం చేసేవాడు. ఈ నెల 12న సంధ్యారాణికి ఆమె మామ సుబ్బరాయుడు ఫోన్ చేసి సునీల్ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని, రూ. 30 లక్షలు కావాలని కోరినట్లుగా చెప్పాడు. దీంతో ఆమె అదేరోజు సాయంత్రం తన భర్తకు ఫోన్ చేయగా, అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మర్నాడు అతడి స్నేహితుడు సురేష్‌కు ఫోన్ చేసి తమ ఇంటికి వెళ్లి చూడాలని కోరింది. సురేష్ అక్కడికి వెళ్లి చూడగా బెడ్‌రూంలో సునీల్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. సురేష్ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: అగ్ని ప్రమాదాలపై అందరు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం ప్రారంభం కావడంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, మంగులాల్ నాయక్, కరుణాకర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట


మరికల్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల ఏఎంసీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ

కుల్కచర్ల: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ అన్నారు. సోమవారం ఆయన చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ శర్మ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతీ కాలనీకి సీసీ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, దామోదర్‌రెడ్డి, నరేందర్, రాజు, వెంకటయ్య, జహంగీర్, నర్సింలు, స్థానిక నాయకులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి భత్యానికి మంగళం!

- ఉపాధి కూలీలకు అందని అదనపు డబ్బులు
- నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి
- పని ప్రదేశాల్లో వసతుల కరువు


బొంపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దోమ: ఎండలో పనిచేసే ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేసవి భత్యానికి నాలుగేళ్లుగా బ్రేక్ పడింది. ప్రభుత్వం గతంలో ఏటా వేసవి భత్యం అందించడంతో పాటు, ఇతర సౌకర్యాలు కల్పించేది. కానీ ప్రస్తుతం అలాంటివేవీ కనిపించడం లేదు. ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఎలాంటి స్పష్టత లేకపోవడంతో భత్యానికి ఈసారి కూడా మంగళం పాడినట్లేనని తెలుస్తోంది.

కొరవడిన స్పష్టత..
గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా పల్లె ప్రజలకు స్థానికంగా పని కల్పిస్తూ భరోసా అందిస్తోంది. దోమ మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 11,725 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, 13,971 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులకు 3,790 మంది కూలీలు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో ఉపాధి హామీ కూలీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి జూన్ నెల వరకు ఐదు నెలల పాటు వారి వేతనానికి అదనంగా 25 నుంచి 30శాతం వేసవి భత్యం చెల్లించేది. కానీ గత నాలుగేళ్లుగా ఇది నిలిచిపోయింది.

సౌకర్యాల లేమితో ఇబ్బందులు..
గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కరువయ్యాయి. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతుండటంతో మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలు అల్లాడిపోతున్నారు. పని చేస్తున్న చోట కనీసం మంచినీరు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, టెంట్లు, అందుబాటులో ఉండటం లేదు. గత ప్రభుత్వాలు కూలీలకు టెంట్లు, మంచి నీరు, గడ్డపారలు, పారలతో పాటు ఇతర పనిముట్లను అందించేంది. కానీ పదేళ్లుగా ప్రభుత్వం ఎలాంటి పరికరాలను అందించడం లేదు. తామే స్వయంగా ఇంటి వద్ద నుంచి పని ముట్లు, నీళ్ల బాటిళ్లు తీసుకుని వెళ్లాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

భత్యం చెల్లించాలి



ఫిబ్రవరి నుంచి జూన్ వరకు అదనంగా ఇవ్వాల్సిన 25 నుంచి 30 శాతం వేసవి భత్యం నిలిచిపోయింది. దీంతో వేసవి కాలంలో పని గిట్టుబాటు కావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి భత్యం చెల్లించేలా చూడాలి.
– కుర్వ లక్ష్మమ్మ, బొంపల్లి

సౌకర్యాలు కల్పించడం లేదు



ఉపాధి పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ కిట్లు, మంచి నీరు, టెంట్లు ఉండటం లేదు. గతంలో పనిముట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం అవి కూడా లేదు.
– బండి చిన్నమ్మ, ఊటుపల్లి

స్పష్టత లేదు



వేసవి భత్యం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. గతంలో కూలీలకు రూ.300 చెల్లించేది. ప్రస్తుతం రూ.307 పెంచింది. పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.
– దత్తయ్య, ఏపీఓ, దోమ

పూజల పేరిట మోసం..

రూ.9.80 లక్షలు వసూలు, అఘోరిపై కేసు నమోదు

శంకర్‌పల్లి: పూజల పేరిట ఓ మహిళ వద్ద డబ్బులు వసూలు చేసిన అఘోరిపై మోకిల పోలిస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ, ప్రగతి రిసార్ట్స్‌లో ఉద్యోగం చేస్తోంది. ఆమెకు ఇతరుల ద్వారా అఘోరి పరిచయమైంది. ఈ క్రమంలో ప్రత్యేక పూజలు చేస్తానని సదరు మహిళను నమ్మించిన అఘోరి.. హైదరాబాద్, ఉజ్జయిని తదితర ప్రాంతాల్లో పూజలు చేసింది. అనంతరం ఆ మహిళ నుంచి రూ. 9లక్షల 80వేలను తీసుకుంది. తర్వాత మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు.. ఫిబ్రవరి 25న మోకిల పీఎస్‌లో అఘోరిపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలల క్రితం నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం గమనార్హం.

క్రషర్ మెషీన్‌లో పడి కార్మికుడి మృతి

మేడ్చల్‌రూరల్: క్రషర్ మెషీన్‌లో పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనీష్‌సింగ్(27) గిర్మాపూర్‌లోని రోబో సిలికాన్ క్రషర్ మెషీన్‌లో ప్లాంట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున విధుల్లో ఉన్న అతను ప్రమాదవశాత్తు క్రషర్ మెషీన్‌లో పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆలయ చైర్మన్ శంకర్, సమితి సభ్యులు

తాండూరు టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో విజేతలకు హనుమాన్ జన్మోత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం బహుమతులు అందజేశారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతిగా హోండా యూనికాన్ బైక్‌ను విజేత గుముడాల సుధాకర్ (నం.9253), ద్వితీయ బహుమతిగా హోండా ఆక్టీవాను విష్ణురాంజీకి (నం.6981) స్థానిక స్టేషన్ హనుమాన్ ఆలయ చైర్మన్ మిస్కిన్ శంకర్, నరహరి అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జన్మోత్సవ సమితి సభ్యులు రజినీకాంత్, మహేష్ ఠాకూర్, రామకృష్ణ, పునీత్, భవానీ సింగ్, గురురాజ్, శ్రీనివాస్, ఆనంద్, శివ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


రవిగౌడ్‌ను పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంగెంకలాన్ గ్రామానికి చెందిన ఎల్మకన్నె పీఏసీఎస్ మాజీ చైర్మన్ సంగెం నారాయణగౌడ్ సతీమణి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం నారాయణగౌడ్ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంగెం కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. అంతియ యాత్రలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, నాయకులు రవీందర్, కేశవరావు, పండరి, సాయిలు, బోయ రాజు, హమీద్ మియా, శ్యామప్ప పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దర్గా ఉత్సవాలు

నవాబుపేట: మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న సాహెబ్ హుస్సేన్ దర్గా ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఎండీ రఫీ, నాయకులు యాదవరెడ్డి, పాపిరెడ్డి, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ములాఖాత్‌లో ఖైదీ వీడియో చిత్రీకరణ

చంచల్‌గూడ: చంచల్‌గూడ జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీ గన్‌తో కాలుస్తున్నట్లు సైగలు చేస్తూ ఫోజులిచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే అహ్మద్ బిన్ హస్సన్ అల్ జాబ్రీ అనే వ్యక్తి చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇటీవల అతడిని ములాఖత్‌లో కలిసేందుకు వచ్చిన అతని మిత్రులు ఫోన్ సంభాషణను వీడియో తీశారు. ఖైదీ వీడియోకు ఫోజులిచ్చాడు. ఇది గత ఆదివారం వైరల్‌గా మారింది. ఈ విషయమై జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్‌ను వివరణ కోరగా ములాఖత్‌కు వచ్చిన యువకుడు లోదుస్తుల్లో మొబైల్ ఫోన్ దాచి ఉండవచ్చని తెలిపారు. ఇకపై మరింత పటిష్టంగా భద్రత చర్యలు చేపడతామన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి


అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అజాగ్రత్తగా ఉంటేనే అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వేసవిలో నిప్పుతో అప్రమత్తంగా ఉండాలని, బీడీ, సిగరెట్ వంటివి వెలిగించి అలాగే విసరేయరాదన్నారు. వంటిట్లో గ్యాస్ సిలిండర్‌ను అవసరం లేని సమయంలో ఆఫ్ చేసి పెట్టాలన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న అగ్నిప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా అగ్ని మాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు, జాగ్రత్తలపై పలు ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. తాండూరు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జలందర్ రెడ్డి ఉన్నారు.

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

- సులభతరం కానున్న రిజిస్ట్రేషన్లు
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి పోర్టల్ అమలు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


పోర్టల్ ఆవిష్కరణను తిలకిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

కడ్తాల్: 'రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం భూ భారతి రికార్డ్స్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్ చట్టాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకం, సులభతరం కానుంది' అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ధరణి పోర్టల్ స్థానంలో, భూ భారతి పోర్టల్‌ను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

జూన్ 2నుంచి అమలు
బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. వారి భూములను.. ఆ పార్టీ పెద్దలు, నాయకులు దోచుకున్నారని విమర్శించారు. సమస్యను బాధిత రైతులు నాటి ప్రభుత్వం తెచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. వీటన్నింటిని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూ భారతిని తెచ్చిందని వివరించారు. ఈ పోర్టల్‌ను రాష్ట్రంలోని మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నామని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలతో పకడ్బందీగా జూన్ 2, 2025 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి పూర్తి స్థాయిలో పోర్టల్ అమలు కానుందని స్పష్టంచేశారు. రైతులకు అన్ని విధాలుగా అర్థమయ్యేలా పోర్టల్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీక్యానాయక్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు జంగారెడ్డి, రాజేశ్, షాబుద్దీన్, బిక్కునాయక్, సేవ్యానాయక్, భానుకిరణ్, శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.